# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 04-01-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- భారతదేశం 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వడానికి సిద్ధంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- అణు, అంతరిక్ష రంగాలలో ప్రైవేట్ సంస్థలకు అవకాశాలు పెరగనున్నాయని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు.
- విబి-జి-రామ్-జి చట్టం ద్వారా రాబోయే ఆర్థిక సంవత్సరానికి లక్షా 51 వేల కోట్ల రూపాయలపైగా కేటాయింపులను ప్రభుత్వం ప్రతిపాదిస్తోందని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడించారు.
- కొత్త కార్మిక చట్టాలు కార్మికుల జీవితాలను సమూలంగా మార్చివేస్తాయని కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవియ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వడానికి సిద్ధంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. వారణాసిలో 72వ జాతీయ వాలీబాల్ టోర్నమెంట్‌ను న్యూఢిల్లీ నుంచి దృశ్య మాధ్యమం ద్వారా ప్రధానమంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... క్రీడా రంగంలో తీసుకు వచ్చిన అనేక సంస్కరణల ఫలితంగా భారతదేశం గణనీయమైన విజయాలను నమోదు చేస్తోందని వెల్లడించారు. క్రీడా రంగంలో ప్రతిభను గుర్తించడం, శాస్త్రీయ శిక్షణ, పౌష్టికాహారం అందించడం, పారదర్శక ఎంపిక విధానాల ద్వారా అత్యుత్తమ క్రీడాకారులను ప్రభుత్వం ముందుకు తెస్తోందని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

ఇదిలా ఉండగా, ఈరోజు నుండి 11వ తేదీ వరకూ జరిగే 8 రోజుల టోర్నమెంట్‌లో దేశం నలుమూలల నుండి వివిధ రాష్ట్రాలు సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 58 జట్ల నుంచి వెయ్యి మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అణు, అంతరిక్ష రంగాలలో ప్రైవేట్ సంస్థలకు అవకాశాలు అందించాలని ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. న్యూఢిల్లీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (DSIR) 41వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని గుర్తు చేశారు. రీసెర్చ్, డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ ఫండ్ (RDI)ను పొందేందుకు అంకుర పరిశ్రమలకు మూడేళ్ల అనుభవం తప్పనిసరి అనే నిబంధనను ప్రభుత్వం తొలగించిందని ఆయన తెలిపారు. కొత్తగా ఏర్పడిన ఏ అంకుర పరిశ్రమ అయినా DSIR ద్వారా నిధిని పొందవచ్చని జితేంద్ర సింగ్ ప్రకటించారు. ఆత్మ నిర్భర్ భారత్ విధానం ద్వారా ఇతర దేశాలు కూడా భారత్ పై ఆధారపడే విధంగా దేశం ఎదుగుతోందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త కార్మిక చట్టాలు కార్మికుల జీవితాలను సమూలంగా మార్చివేస్తాయని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియ అన్నారు. పశ్చిమ బెంగాల్ పర్యటనలో భాగంగా ఆయన డార్జిలింగ్ పర్వతశ్రేణులలోని తెరాయ్, డూయార్స్ ప్రాంతాలలోని తేయాకు సింకోనా కార్మిక సంఘాల నాయకులతో ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్మికుల ప్రస్తుత స్థితిగతులను మార్చడానికే కొత్త కార్మిక చట్టాలను రూపొందించామని తెలిపారు. పాతకాలం నాటి కార్మిక చట్టాల వల్ల నష్టపోయిన కార్మికులకు దీని వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని మన్సుఖ్ మాండవియ కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వెనిజులాలో తాజాగా సంభవించిన పరిణామాల నేపథ్యంలో భారత పౌరులు వెనిజులాకు వెళ్ళేందుకు చేసే ప్రయాణాలను నిలుపుదల చేసుకోవాలని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. వెనిజులాలో ఉన్న భారతీయులందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. అవసరమైన పక్షంలో కారకాస్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపింది. రాయబార కార్యాలయం ఇమెయిల్ ఐడి cons.caracas@mea.gov.in, లేదా అత్యవసర ఫోన్ నంబర్ +58-412-9584288ను సంప్రదించాలని వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ ఎస్ . జై శంకర్ ఈ రోజు నుండి ఈ నెల 10వ తేదీ వరకూ ఫ్రాన్స్, లక్సంబర్గ్ లలో పర్యటించనున్నారని విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. ఈ పర్యటనలో భాగంగా ప్యారిస్ లో ఫ్రెంచ్ అధికార వర్గాలతో జైశంకర్ సమావేశమవుతారు. భారత్-ఫ్రాన్స్ దేశాలు వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా సాధించిన పురోగతిని ఈ సందర్భంగా చర్చిస్తారని ఆ శాఖ తెలిపింది. అదే విధంగా ఫ్రెంచ్ అంబాసిడర్స్ సదస్సు 31వ ఎడిషన్ కి ఆయన గౌరవ అతిధిగా హాజరవుతారని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవిక మిషన్ గ్రామీణ్ (విబి-జి-రామ్-జి) చట్టం ద్వారా రాబోయే ఆర్థిక సంవత్సరానికి లక్షా 51 వేల 282 కోట్ల రూపాయల కేటాయింపులను ప్రభుత్వం ప్రతిపాదించిందని కేంద్ర వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఇందులో 95 వేల కోట్ల రూపాయలకు పైగా నిధులను కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తుందని ఆయన చెప్పారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన పాత్రికేయుల సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... ఈ చట్టం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో నిజమైన అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. జాతీయ ఉపాధిహామీ పథకంలోని లోపాలను సవరించి.. వీబీ-జి-రామ్-జి చట్టం తీసుకుని వచ్చామని శివరాజ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశంలో సాంప్రదాయ వైద్య విధానాన్ని, ఎగుమతులను ప్రోత్సహించే ప్రయత్నాలలో భాగంగా ఆయుష్ ఎగుమతి ప్రోత్సాహక మండలి న్యూఢిల్లీలో ఈ రోజు తన 4వ వ్యవస్థాపక వార్షికోత్సవాన్ని జరుపుకుంది. దేశంలోని ఆయుష్ మూలికా ఉత్పత్తుల ఎగుమతులు ఇప్పటి వరకూ 6.11 శాతం వృద్ధిని నమోదు చేశాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఆయుష్ ఎగుమతి ప్రోత్సాహక మండలి రానున్న కాలంలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ద్వారా అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి కృషి చేయనుంది. అదే విధంగా భారతదేశ సాంప్రదాయ వైద్య విధానాలకు ప్రపంచ వ్యాప్త ఆమోదాన్ని పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచానికి వరి ఎగుమతి చేసే కీలక దేశంగా భారత్ అవతరించిందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఐకార్ (ICAR) అభివృద్ధి చేసిన 25 పంటలకు చెందిన 184 మెరుగైన కొత్త విత్తనాలను ఢిల్లీలో ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... భారతదేశ వరి ఉత్పత్తి 2025 సంవత్సరంలో 150 మిలియన్ టన్నులను అధిగమించిందన్నారు. అదే విధంగా వరి ఉత్పత్తిలో భారత్.. చైనాను సైతం దాటిందని తెలిపారు. దేశంలో గత పదేళ్ళ కాలంలో 3,200కు పైగా కొత్త రకాల విత్తనాలు అభివృద్ధి చేయడం జరిగిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన వివిధ పథకాలు మూడేళ్లలోగా దేశవ్యాప్తంగా ఉన్న రైతులందరికీ చేరేలా కృషి చేస్తున్నామని శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీ, హర్యానా, చండీగఢ్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, బీహార్ ఒడిశా రాష్ట్రాలలో రానున్న ఇరవై నాలుగు గంటల పాటు దట్టమైన, అతి దట్టమైన పొగమంచు పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. అలాగే రాబోయే మూడు రోజులలో పంజాబ్, హర్యానా, చండీగఢ్ ఢిల్లీలలో చలిగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌లోని కొన్ని ప్రాంతాలతో పాటు, జమ్మూలలో రాబోయే రెండు రోజుల్లో దట్టమైన పొగమంచు పరిస్థితులు కొనసాగుతాయని IMD అంచనా వేసింది. ఈ నెల 8 వరకు హిమాచల్ ప్రదేశ్ ఉత్తరాఖండ్‌లలో ఇటువంటి వాతావరణ పరిస్థితులు ఉంటాయని వివరించింది. రాబోయే రెండు రోజులలో వాయువ్య భారతదేశంలో కనిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా 2 నుండి 3 డిగ్రీల సెల్సియస్ వరకూ తగ్గుతాయని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వెనిజులాలో అమెరికా చేపట్టిన ఆపరేషన్ విషయంపై చర్చించడానికి ఐక్య రాజ్యసమితి భద్రతా మండలి రేపు అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించింది. మండలిలో తాత్కాలిక సభ్య దేశమైన కొలంబియా అభ్యర్థన మేరకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =